Dr.PRK
# పవర్
పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప




మందలో ఒకరిగా ఉండకు
వందలో ఒకరిగా ఉండటానికి
ప్రయత్నించు


రామకృష్ణ హాస్పిటల్స్
పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం

రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్
విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 339 | గురువారం 10 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

- కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు
- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



హైదరాబాద్, పవర్ న్యూస్

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు.

శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు.

ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

# కేసీఆర్ ఇల్లును పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి



రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాలు, ఇళ్లు ముట్టడిస్తాము
-- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

(హనుమకొండ – పవర్):

దళిత స్పీకర్‌ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో కేసీఆర్ ఫార్మ్‌హౌస్‌కు వెళ్లిన దళిత నాయకుల పట్ల వివక్ష చూపుతూ, పసుపు నీళ్లతో ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయడం అత్యంత అవమానకరమైన చర్య అని, ఇందుకు ప్రోత్సహించిన కేసీఆర్‌ను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. దళితులు వచ్చినందుకు ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యగా కనిపిస్తోందని, ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్‌లో ఉన్న దళిత నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో పాటు ఇతర నాయకులు ఈ ఘటనను ఖండించి దళితుల ఆత్మగౌరవం కోసం నిలబడాలని డాక్టర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. దళితులను అవమానించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనకు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని, బీఆర్ఎస్ కార్యాలయాలు, నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి విజయ్, రమేష్, మహేష్, రాజు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



# దళితులు నడిస్తే శుద్ధిచేస్తారా?

ఇంకా ఎంతకాలం ఈ దాష్టీకం?: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, పవర్ న్యూస్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లను పసుపునీళ్లతో శుద్ధి చేయటంపై మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులు నడిచారన్న కారణంతో రోడ్లను శుద్ధిచేసి, బీఆర్ఎస్ నేతలు తమ అసలు బుద్ధిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. ఈ అంశంపై శాసన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు బుధవారం

మిగతా 2లో

# 1100 ఎకరాల భూసేకరణ..

- బుల్లెట్ రైల్ పనుల వేగవంతం
- తగిన పరిహారం ఇవ్వాలంటున్న స్థానిక రైతులు

వివరాలు 2 లో..




# ఎర్రకోట పేలుడు ఆత్మాహుతి దాడే: ఎన్ఐఏ



వివరాలు 2 లో..

# సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తొసేశారు..

మంత్రి సీతక్క సంచలన ఆరోపణ


2

హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్..

# 3 నెలలే డెడ్‌లైన్!

- హైదరాబాద్‌లో నిబంధనలు పాటించని హాస్టళ్లపై హైడ్రా ఉక్కుపాదం
- ప్రమాదకర భవనాలను ఖాళీ చేసేందుకు 3 నెలల గడువు
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక తనిఖీలు
- విద్యార్థుల భద్రతతో రాజీపడొద్దని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం



2

# దళితులు నడిస్తే శుద్ధిచేస్తారా?

మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ సమాజంలో చీలికలు తీసుకురావాలని బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని భట్టి విమర్శించారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును సభ కోరుకోవడం లేదు. కేసీఆర్ చావాలనే ఉద్దేశం మాకైతే లేదు. ఆ ఉద్దేశం మీకు(బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి) ఉండొచ్చు. కేసీఆర్ బతికుండాలని... బతికి ఉన్నన్ని రోజులు ప్రతిపక్ష నేతగా రాష్ట్రానికి సేవలందించాలని కోరుకుంటున్నాం. సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ చేసి, మళ్లీ నిరసన తెలపటం ఏంటి? మీకు ఏం న్యాయం కావాలి? దళితులు నడిచారని పసుపు నీళ్లతో కడుగుతారా? ఎంతకాలం ఈ దాష్టీకం? నాగరిక సమాజంలోనే ఉన్నామా...? మీ సవాళ్లకు ఇక్కడ ఎవరూ భయపడరు. ఇంకా మీ దొరతనం భరించడానికి సిద్ధంగా లేము. పసుపు నీళ్లతో రోడ్డు శుద్ధి చేయటంపై సభలో చర్చ జరగాల్సిందే' అని డిమాండ్ చేశారు. కేసీఆర్ వందేళ్లు బతికుండాలని, ప్రతిపక్ష నేతగా రాష్ట్రానికి సేవలందించాలని కోరుకుంటున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దళితులు రోడ్డుపై నడిచారని పసుపు నీళ్లతో శుభ్రం చేయటంపై మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో బతకాలని కోరుకుంటున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా అసెంబ్లీలో ఇదే మాట చెప్పారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కానీ, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావే.. కేసీఆర్ చనిపోవాలని క్షుద్రపూజలు చేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం మాత్రం పోవటంలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మిత్రులని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపిస్తున్నారని... బీఆర్ఎ?సను బొందపెట్టే తాము ఇక్కడికి వచ్చామని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దళితుల పేరు చెప్పి బీఆర్ఎస్ అధికారం సంపాదించి, చివరకు వారినే అణగదొక్కిందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దళితుల అస్థిత్వం ముందుబీఆర్ఎస్ ఎంతటిదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు బట్టలు విప్పేసి చిల్లర చేతలు చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. తాతా మధు మాట్లాడింది ఆయన మాటలు కావని.. అవి కేసీఆర్ భావజాలం నుంచి వచ్చాయని విమర్శించారు. కేసీఆర్ ఫాంహౌజ్ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధిచేయటం హేయమైన చర్య అని సీపీఐ శాసన సభాపక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆధునిక సమాజాన్ని ఆటవిక సమాజం వైపు తీసుకెళ్తున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

## ఎర్రకోట పేలుడు ఆత్మాహుతి దాడే: ఎన్ఐఏ

న్యూఢిల్లీ, పవర్ న్యూస్

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతేడాది నవంబర్ 10న జరిగిన పేలుడు, ఆత్మాహుతి ఉగ్రదాడేనని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) తేల్చింది. ప్రధాన నిందితుడు ఉమర్ ఉన్‌నబీ ఐ20 కారులో కూర్చుని లోపలి నుంచే ఐఈడీ బాంబును పేల్చినట్టు ఢిల్లీలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో దాఖలు చేసిన 7,500 పేజీల చార్జిషీటులో పేర్కొంది. నాటి ఉగ్రదాడిలో 15 మంది ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. వృత్తిరీత్యా వైద్యుడైన నబీ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. పేలుడు జరిగిన ప్రదేశం నుంచి సేకరించిన నమూనాలకు డీఎన్ ఏ పరీక్ష నిర్వహించగా, ఆ సమయంలో నబీ కారులోనే ఉన్నాడని నిర్ధారణ అయిందని ఎన్ఐఏ పేర్కొంది. దాడి కోసం రెండేళ్ల ముందుగానే 2023 నుంచే ఎర్రకోట పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలిపింది. అల్‌ఖైదా అనుబంధ విభాగమైన 'అన్సార్ గజ్వత్ ఉల్ హింద్' మాడ్యూల్‌ను పునరుద్ధరించడంతోపాటు.. ఈ మాడ్యూల్‌కు అతడే కీలక సూత్రధారిగా వ్యవహరించాడని ఎన్ఐఏ తెలిపింది.

# సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

**మంత్రి సీతక్క సంచలన ఆరోపణ**
**అసెంబ్లీ ఘటన వివాదంలో కొత్త కోణం**
**సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలను తోసేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆరోపణ**
**గాయపడిన మహిళా పోలీసులను పరామర్శించిన సీతక్క**
**సీతక్క విడుదల చేసినవి మార్ఫింగ్ ఫొటోలంటూ బీఆర్ఎస్ ఎదురుదాడి**

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు.మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు.గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి.మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క, బీఆర్ఎస్ నేతల దాడిలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని పరామర్శించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఆమె స్పష్టం చేశారు. కాగా, మంత్రి సీతక్క విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినవని, అవి ఏఐ-జనరేటెడ్ అని బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేశారు.

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!: కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

హైదరాబాద్, పవర్ న్యూస్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న



కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!

హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్ నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన నిబంధనలు జారీ చేసింది. సురక్షితం కాని, అనుమతులు లేని భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షితమైన భవనాల్లోకి మార్చాలని నిర్వాహకులకు అల్టిమేటం ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేస్తామని స్పష్టం చేసింది.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మరణించడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు చనిపోవడం వంటి ఘటనల నేపథ్యంలో హైడ్రా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు.కేవలం లాభార్జన కోసం భద్రతను విస్మరించవద్దని, హాస్టల్ వాసులను తమ సొంత బిడ్డల్లా భావించి వసతులు కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాలు నివారణ చర్యల, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై వీడియోల ద్వారా నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

# 1100 ఎకరాల భూసేకరణ..

హైదరాబాద్, పవర్ న్యూస్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బుల్లెట్ రైల్ కారిడార్‌తోపాటు ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ప్రభుత్వం భారీ భూసేకరణ చేపట్టింది. రైల్వే కారిడార్ ప్రాజెక్టు కోసం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న బహదూర్‌గూడలో భూములను సేకరించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నైలకు నేరుగా వెళ్లే బుల్లెట్ రైళ్ల కోసం ఇక్కడ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూములకు ఇటీవల కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని స్థానిక రైతులు తీవ్రంగా అడ్డుకున్న సంగతి తెలిసిందే. భూసేకరణను వ్యతిరేకిస్తూ కొందరు రైతులు హైకోర్టులో కేసులు కూడా దాఖలు చేశారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే ప్రభుత్వం మరింత భూమి సేకరించాలని నిర్ణయించింది. బుల్లెట్ రైల్ కారిడార్‌తోపాటు మెట్రో, బస్ టర్మినల్ ఇతర మౌలిక సదుపాయాల కోసం దాదాపు 1100 ఎకరాల వరకు సేకరించనుంది. ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరుతో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరకు బుధవారం బహదూర్‌గూడలో 796.28 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. సమీపంలోని రాయకుంట, కొంగరకుర్దు, సయ్యద్‌గూడలో కూడా భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయనుంది. కాగా బహదూర్‌గూడలో 796.28 ఎకరాల భూసేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో 146.28 ఎకరాలు ప్రైవేటు భూమి కాగా మిగతా 650 ఎకరాలు ప్రభుత్వ భూమి. సర్వేనంబరు 28లో 150 ఎకరాలు, సర్వేనంబరు 62లో 500 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ఎవరూ కూడా ఈ భూములకు సంబంధించిన లావాదేవీలు, అభివృద్ధి పనులు నిర్వహించడానికి వీల్లేదని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఈ భూమిలోకి వెళ్లి సర్వే చేయడానికి అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొంది. కాగా, బహదూర్‌గూడలోని సర్వేనంబరు 28, 62లోని 650 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు స్థానికులు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. తమకు తగిన పరిహారం చెల్లించిన తరువాతనే వాటిని స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఇక్కడ సర్వే చేసేందుకు వెళ్లిన అధికారులను ఈ రైతులు అడ్డుకున్నారు. దీంతో కొన్నిరోజులపాటు ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఎకరానికి 500 గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీన్ని మరింత పెంచాలని రైతులు కోరుతున్నారు. కాగా, తాజా నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోపు లిఖితపూర్వకంగా తెలపవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

# టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి.. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: ఎస్పీ హెచ్చరిక



(భూపాలపల్లి -- పవర్):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలను, రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. రికార్డులు, పెండింగ్ కేసుల సమీక్ష: పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన వివిధ కేసులు, దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసుల పురోగతిని ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. పాత కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. సిసి కెమెరాల పనితీరు పరిశీలన: స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, వాటి నిర్వహణను ఆయన అడిగి తెలుసుకున్నారు. నిరంతరం నిఘా ఉంచడం ద్వారా నేరాల నివారణ సాధ్యమవుతుందని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి ఫిర్యాదులను వెంటనే స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలపై అప్రమత్తత: మండలంలో అశాంతికి తావులేకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గస్తీని తీవ్రతరం చేయాలని ఆదేశించారు.

అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ప్రజా భద్రతే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్న ఎస్పీ, విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక పోలీసు అధికారులు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

---

# ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

## జిల్లా కలెక్టర్, సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన విష్ణు వర్ధన్ రెడ్డి







(హనుమకొండ -- పవర్):
హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్‌ను, అలాగే సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ శ్రీమతి శ్వేత, ఐపీఎస్ గారిని యువ నాయకులు శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రెడాయ్ (CREDAI) వరంగల్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న "ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026, ఎడిషన్--2" కార్యక్రమానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీమతి శ్వేత, ఐపీఎస్ గారిని కలిసి మారథాన్ నిర్వహణ రూప్‌రేఖలు, రూట్ మ్యాప్ మరియు భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి వివరాలను వివరించారు. అక్టోబర్ 11న మారథాన్: రాబోయే అక్టోబర్ 11, 2026న హనుమకొండలోని చారిత్రక కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి ఈ మారథాన్ ప్రారంభం కానుంది. మూడు విభాగాల్లో రన్: ఇందులో ప్రధానంగా 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు మరియు 5 కిలోమీటర్ల రన్ విభాగాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆరోగ్యం -- క్రీడా స్ఫూర్తి: యువతలో ఆరోగ్యం, శారీరక ఫిట్‌నెస్‌పై విస్తృత అవగాహన పెంపొందించడంతో పాటు వరంగల్ ట్రై సిటీస్ పరిధిలో క్రీడా స్ఫూర్తిని, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. యంత్రాంగం సహకారం: మారథాన్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సంపూర్ణ సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్/స్థానిక నాయకులు సోమయ్య, కందుకూరు శ్రీనివాస్, రన్నర్స్ చరణ్, సరస్వతిలతో పాటు పలువురు కార్యక్రమ నిర్వాహకులు, క్రెడాయ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

## గిర్నిబావిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం



(నర్సంపేట - పవర్):
ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహను నర్సంపేట శాసనసభ్యులు శ్రీ దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సంపేట నియోజకవర్గంలోని గిర్నిబావి గ్రామం, దాని పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, గిర్నిబావిలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) ఏర్పాటు చేయాలని కోరుతూ గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయడం, అత్యవసర వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం మరియు ప్రజల ఆరోగ్య సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఈ ప్రతిపాదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఎల్‌వోసీ చెక్కుల అందజేత: వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



(హైదరాబాద్ -- పవర్):
అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఎల్‌వోసీ (రాజ) చెక్కులను బాధితులకు అందజేసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కె.ఆర్. నాగరాజు అండగా నిలిచారు. వర్ధన్నపేట మండలం గుబ్బెట తండాకు చెందిన బాణోత్ వెంకటరామ్ నాయక్ చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి రూ.3 లక్షల ఎల్‌వోసీ చెక్కును, అలాగే దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి నర్సమ్మకు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌వోసీ పత్రాలను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే గారి కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని, ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

## అంజుమన్-ఏ-హైదర్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ: విష్ణు వర్ధన్ రెడ్డి




(హనుమకొండ -- పవర్):
అంజుమన్-ఏ-హైదర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భారీ రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి అల్లుడు శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి గారు ఆవిష్కరించారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. రక్తదానం అత్యంత పవిత్రమైనది: పోస్టర్ ఆవిష్కరణ అనంతరం విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో రక్తదానం చేయడం అత్యంత పవిత్రమైన కార్యమని పేర్కొన్నారు. ప్రమాదాల్లో ఉన్న వారితో పాటు ముఖ్యంగా క్యాన్సర్, తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు రక్తదానం ఎంతో ప్రాణరక్షణగా నిలుస్తుందని తెలిపారు. 11వ తేదీన రక్తదాన శిబిరం: రాబోయే సెప్టెంబర్ 11, 2026న నిర్వహించనున్న ఈ బృహత్తర రక్తదాన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనం చేసే ఒక్క డోస్ రక్తదానం మరొకరి జీవితంలో వెలుగులు నింపి ప్రాణదాతలుగా నిలబెడుతుందని అన్నారు. నిర్వాహకులకు అభినందనలు: మానవత్వంతో ఈ సేవా కార్యక్రమాన్ని తలపెట్టిన అంజుమన్-ఏ-హైదర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను, నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



## వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

(హనుమకొండ -- పవర్):

చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తులందరూ భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.కరపత్ర ఆవిష్కరణకు ముందు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎంపీకి తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఎంపీ కోరారు.పక్కా ఏర్పాట్లు చేయాలి: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, ఆలయ నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధానితో పాటు ఇతర ఆలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైల్వే అభివృద్ధికి భారీ ఊతం

**- సికింద్రాబాద్--కాజీపేట మల్టీ ట్రాకింగ్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్**

**- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

(హనుమకొండ -- పవర్):



తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం అత్యంత కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 10,021 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 540 కిలోమీటర్ల మేర ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. 2029--30 నాటికి ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా సమగ్ర చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.విజ్ఞప్తికి సానుకూల స్పందన: తెలంగాణకు సంబంధించి సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)--కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుకు ఆమోదం లభించడం రాష్ట్ర రైల్వే రంగానికి మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు ఆవశ్యకతపై గతంలో తాను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను వ్యక్తిగతంగా కలసి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు తెలంగాణకు కలిగే ప్రయోజనాలను వివరించి వినతిపత్రం సమర్పించినట్లు గుర్తుచేశారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి ఆమోదం తెలపడంపై ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.రవాణా సామర్థ్యం పెంపు -- కనెక్టివిటీ: పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రైళ్ల రద్దీ తగ్గి, రవాణా సామర్థ్యం పెరుగుతుందన్నారు. దీనివల్ల యాదగిరిగుట్ట, భువనగిరి కోట, సురేంద్రపురి, స్వర్ణగిరి వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగై, ఉపాధి, వ్యాపార అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు.పారిశ్రామిక పురోగతి -- పర్యావరణ పరిరక్షణ: అదనంగా 47 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరగడం వల్ల బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు పరిశ్రమలకు రవాణా సౌలభ్యం లభిస్తుందన్నారు. అలాగే రోడ్డు రవాణాపై ఒత్తిడి తగ్గి, సుమారు 8 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు ఆదా అవ్వడమే కాకుండా 42 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని వివరించారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి మరిన్ని రైల్వే సౌకర్యాలు, మౌలిక వసతులు తీసుకురావడానికి భవిష్యత్తులోనూ నిరంతరం కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని బీఆర్ఎస్ మానుకోవాలి

**- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**- ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు.. గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ కొత్త నాటకాలు!**



(హైదరాబాద్ -- పవర్):

బీఆర్ఎస్ నాయకులు గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని వీడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, తీవ్ర పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిరోజూ కొత్త అంశాలను తెరపైకి తెస్తూ నాటకాలాడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

సభా సంప్రదాయాలను మంటగలుపుతున్నారు: అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని, అక్కడ ప్రతినిధులు హుందాగా నడుచుకోవాలని నాయిని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల తీరు చూస్తుంటే సభా సంప్రదాయాలపై కనీస గౌరవం లేనట్లు కనిపిస్తోందని, వారి అసహనం, ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా బయటపడుతున్నాయని విమర్శించారు.

?పదేళ్ల హామీలపై సమాధానం చెప్పాలి: అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో బీఆర్ఎస్ ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి వంటి కీలక హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు.ఆర్థిక సంక్షోభంలోనూ కాంగ్రెస్ సంక్షేమం: గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసి భారీగా అప్పుల కూపంలోకి నెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుంటే, అది చూడలేకనే బీఆర్ఎస్ నేతలు అసహనంతో అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు.శిఖండి రాజకీయాలు స్వస్తి పలకాలి: గతంలో ఉద్యమ సమయంలోనూ, పాలనలోనూ ప్రతిపక్షాలను, అధికారులను బెదిరించిన సంస్కృతినే ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలను ముందు పెట్టి శిఖండి రాజకీయాలు చేయడం ఆపి, నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు.

# సభా గౌరవాన్ని మంటగలపొద్దు.. స్పీకర్ పదవిని గౌరవించాలి

**- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**-కాళోజీ స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించాలి.. మహిళా పోలీసుల పట్ల దురుసు ప్రవర్తనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు**



(హనుమకొండ -- పవర్):

శాసనసభలో స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సేవలను, ఆయన సాహిత్య ప్రస్థానాన్ని స్మరించుకున్నారు.అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడారు.స్పీకర్ పదవిని గౌరవించాలి: స్పీకర్ ఏ కులం, ఏ మతానికి చెందిన వ్యక్తి అన్నది కాకుండా, ఆ కుర్చీని మరియు రాజ్యాంగబద్ధమైన పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. అనుచిత పదజాలం ఉపయోగించిన వారు తమ తప్పును తెలుసుకుని కూడా క్షమాపణ చెప్పేందుకు ముందుకు రాకపోవడం విచారకరమన్నారు.

నాయకత్వ లక్షణం క్షమాపణ చెప్పడమే: ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాల్సిన అసెంబ్లీలో ఇలాంటి పదజాలానికి తావివ్వడం ఎవరూ హర్షించరని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఇలాంటి భాషను గతంలో ఎప్పుడైనా ప్రోత్సహించారా? పార్లమెంట్లో గానీ, అసెంబ్లీలో గానీ ఇలాంటి పదజాలం వినడం జరిగిందా? అని ప్రశ్నించారు. తప్పు జరిగితే అంగీకరించి క్షమాపణ చెప్పడం నాయకత్వ లక్షణమని, దాంతో గౌరవం తగ్గదని వ్యాఖ్యానించారు.

మహిళా పోలీసుల పట్ల అమర్యాదపై చర్యలు: మహిళా పోలీసు సిబ్బందితో వ్యవహరించే తీరుపైనా ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుల్ అయినా, ఉన్నతాధికారి అయినా ప్రతి మహిళను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. మహిళా పోలీసుల సమక్షంలో కేటీఆర్, హరీష్ రావు చొక్కాలు విప్పడం, ఆందోళన సమయంలో వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు.

అసెంబ్లీలో ప్రశ్నించండి -- కాలయాపన చేయకండి: “ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే అసెంబ్లీలో ప్రశ్నించండి.. ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంది” అని అన్నారు. ప్రజాధనంతో నడిచే శాసనసభా సమావేశాలను అడ్డుకోవడం, కాలయాపన చేయడం ద్వారా ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. చట్టసభల్లో టీషర్టులపై రాతలు, ప్లకార్డులు వంటి వాటికి నిబంధనల ప్రకారం అనుమతి ఉండదని గుర్తుచేశారు.

జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు: మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో, చట్టాన్ని అమలు చేసే మహిళా పోలీసులే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే భవిష్యత్తులో వారు విధులు నిర్వహించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తాను జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులను కమిషన్ ముందు హాజరుపరిచి వివరణ కోరాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే తెలంగాణ డీజీపీ, పోలీస్ కమిషనర్, అసెంబ్లీ సెక్రటేరియట్ కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కాళోజీ రచనలు నేటి తరానికి దిక్సూచి: కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల ఆవేదనకు, పోరాట స్ఫూర్తికి ప్రతిరూపమని ఎంపీ అన్నారు. అన్యాయాలు, సామాజిక అసమానతలపై తన కలాన్ని అస్త్రంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపారని కొనియాడారు. ప్రజాకవి పుట్టిన నేలలో ప్రజాప్రతినిధిగా ఉండటం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, నేటి తరం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దీన్ దయాళ్ నగర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

## ముఖ్య అతిథిగా హాజరైన యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి

(హనుమకొండ -- పవర్):
హనుమకొండలోని దీన్ దయాళ్ నగర్‌లో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాలకు రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి అల్లుడు శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని విష్ణు వర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని వేడుకున్నారు.బోనాలు మన సంస్కృతికి ప్రతీక: ఈ సందర్భంగా విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. మన పండుగలను, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి యువకుడి బాధ్యత అని అన్నారు.ప్రజల్లోనే ఉంటూ సేవా కార్యక్రమాలు: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆశీస్సులతో, వారి ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి, సేవా కార్యక్రమాలకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు విష్ణు వర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు దరువుల మధ్య బోనాల మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగాల వయోపరిమితిని పెంచాలని సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ విజ్ఞప్తి

హైదరాబాద్,
పవర్ న్యూస్



బల్మూరి వెంకట్ వినతిపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూల స్పందన తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. పోలీస్ కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులు దరఖాస్తుకు గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.కానిస్టేబుల్ పోస్టులకు వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 34 ఏళ్ల నుంచి 36 ఏళ్లకు, ఎస్ఐ పోస్టులకు 37 ఏళ్ల నుంచి 38 ఏళ్లకు పెంచాలని బల్మూరి వెంకట్ తన అభ్యర్థనలో పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కారణంగా గతంలో నియామక ప్రక్రియలు జాప్యం కావడం, ఉద్యోగ నోటిఫికేషన్లు సకాలంలో వెలువడకపోవడంతో చాలా మంది అభ్యర్థులు వయోపరిమితి దాటి అర్హత కోల్పోయారని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో, నష్టపోయిన నిరుద్యోగ యువతకు న్యాయం చేసేందుకు వయోపరిమితిని పెంచడమే సరైన మార్గమని బల్మూరి వెంకట్ వివరించారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడితే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

# Cases Under the SC/ST (Prevention of Atrocities) Act Must Be Filed Against Those Who Purified KCR's Residence with Turmeric WaterWe Will Besiege BRS Offices and Residences Across the State

**– Dr. Perumandla Ramakrishna**




**Hanamkonda, September 9:** Senior Congress leader and Chairman of Ramakrishna Charitable Trust, Dr. Perumandla Ramakrishna, strongly condemned the alleged act of purifying the premises with turmeric water after Dalit leaders visited KCR's farmhouse as part of a Congress SC Department protest demanding the immediate dismissal of BRS MLC Thatha Madhu for his alleged insulting remarks against the Dalit Speaker.Dr. Ramakrishna stated that treating the place with turmeric water after Dalit leaders visited it is a deeply humiliating and discriminatory act. He demanded that those responsible, as well as those who encouraged such actions, be held accountable under the law.He said that purifying the premises merely because Dalit leaders had visited it appears to promote the practice of untouchability and caste discrimination. He demanded that cases be registered under the SC/ST (Prevention of Atrocities) Act against those responsible and that strict legal action be taken.Dr. Ramakrishna also appealed to Dalit leaders within the BRS, including former Deputy Chief Minister Tatikonda Rajaiah, R.S. Praveen Kumar, former MLA Aroori Ramesh, and other leaders, to condemn the incident and stand up for the self-respect and dignity of Dalits."The Congress Party will not tolerate any act that insults or humiliates Dalits under any circumstances. Our fight will continue until legal action is taken against those responsible," Dr. Ramakrishna said.He demanded immediate action against those responsible and warned that if such incidents are repeated, protests will be intensified across the state.Congress leaders Thallapelli Vijay, Ramesh, Mahesh, Raju, Mogili, and others participated in the programme.

# ఓయాసిస్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందనలు

(హనుమకొండ -- పవర్):
ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియన్ స్టేట్స్ (OASIS) అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖ వైద్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ల అత్యున్నత సంస్థ అయిన 'ఓయాసిస్'కు అధ్యక్షుడిగా మన ప్రాంతానికి చెందిన డాక్టర్ విజయచందర్ రెడ్డి ఎన్నిక కావడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. వైద్య రంగంలో ఆయన అందిస్తున్న అమూల్యమైన సేవలను ప్రశంసిస్తూ, ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో సంస్థ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.కృషి చేస్తానన్న డాక్టర్ విజయచందర్ రెడ్డి:

తనను అభినందించి, సత్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.వైద్య సేవలే ధ్యేయం: రాబోయే కాలంలో ఓయాసిస్ సంస్థ ద్వారా ఆర్థోపెడిక్ వైద్యుల నైపుణ్యాభివృద్ధికి, వైద్య పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తానని పేర్కొన్నారు. అలాగే సామాన్య ప్రజలకు మెరుగైన, ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి శ్రమిస్తానని స్పష్టం చేశారు.







# ముంబైకి శ్రీలీల షిఫ్ట్..!

## బాలీవుడ్ మూవీలపైనే దృష్టి

దక్షిణాది చిత్రసీమలో తన డ్యాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఉంటూ వరుస టాలీవుడ్ సినిమాల్లో నటించిన ఈ బ్యూటీ.. ఇక ముంబైకి శాశ్వతంగా షిఫ్ట్ అయ్యేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తుండటంతో ముంబైలో సొంత ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కోసం శ్రీలీల వెతుకుతున్నట్లు సమాచారం. ఇప్పటికే యువ హీరో కార్తీక్ ఆర్యన్‌తో పాటు పలువురు బాలీవుడ్ కథానాయకుల సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్న ఆమె.. దక్షిణాది నుంచి బాలీవుడ్‌లో తన మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ముంబైకి షిఫ్ట్ అయితే టాలీవుడ్‌కు శ్రీలీల దూరమవుతారా? అనే చర్చ కూడా మొదలైంది. హైదరాబాద్ నుంచి బాలీవుడ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగితే రెండు పరిశ్రమల్లోనూ అవకాశాలను కొనసాగించవచ్చని అభిమానులు, సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల ముంబై షిఫ్ట్ వార్త ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.



### కథల ఎంపికలో తడబాటు..

# టాలెంట్ ఉన్నా.. అనుపమకు అవకాశాలు కరువు

మలయాళ చిత్రసీమ నుంచి వచ్చి 'ప్రేమమ్', 'అ ఆ', 'శతమానం భవతి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. అందం, అభినయం రెండూ ఉన్నప్పటికీ ఇప్పటికీ స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకోకపోవడం ఆసక్తికరంగా మారింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ.. ఇతర యువ కథానాయికలతో పోలిస్తే అనుపమ కెరీర్ వేగం కాస్త తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అనుపమ ఖాతాలో విజయవంతమైన చిత్రాలకు కొదవలేదు. 'రాక్షసుడు', 'కార్తికేయ 2', 'టిల్లు స్క్వేర్'తో పాటు 'బైసన్', 'కిష్కింధపురి' వంటి సినిమాలు నటిగా ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. అయితే ఈ విజయాల్లో ఎక్కువ భాగం హీరో క్రేజ్, కథా బలం కారణంగా వచ్చినవే తప్ప.. అనుపమకు సోలో స్టార్ ఇమేజ్‌ను తీసుకురాలేకపోయాయనే అభిప్రాయం ఉంది.

### కమర్షియల్ సినిమాలపై ఫోకస్ అవసరమా?

అనుపమ ఎక్కువగా నటనకు ప్రాధాన్యమున్న విభిన్న కథలను ఎంచుకుంటున్నారు. అయితే టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదగాలంటే అగ్ర హీరోల సరసన భారీ కమర్షియల్ ప్రాజెక్టుల్లో నటించడం కూడా కీలకమనే విశ్లేషణ వినిపిస్తోంది. మరోవైపు మమితా బైజు, ఖయాదు లోహర్ వంటి యువ కథానాయికలు కమర్షియల్ ప్రాజెక్టులతో దూసుకుపోతుండగా.. అనుపమ మాత్రం ప్రయోగాత్మక చిత్రాలు, పక్కింటి అమ్మాయి తరహా పాత్రలకే ఎక్కువగా పరిమితమవుతున్నారనే చర్చ ఉంది. టాలెంట్‌కు కొదవలేని అనుపమ.. ఇకపై కథల ఎంపికలో కమర్షియల్ లెక్కలకూ ప్రాధాన్యమిస్తే స్టార్ హీరోయిన్ రేసులో మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని సినీ అభిమానులు భావిస్తున్నారు.





# గ్రీన్ శారీలో సిమ్రాన్ చౌదరి

## సంప్రదాయ అందాలతో మెస్మరైజ్

హీరోయిన్ సిమ్రాన్ చౌదరి సంప్రదాయ చీరకట్టులో అందంగా మెరిసింది. తాజాగా గ్రీన్ కలర్ శారీలో భారీ ఆభరణాలు ధరించి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. పచ్చని చీరకు కాంట్రాస్ట్‌గా ఎరుపు రంగు బ్లౌజ్, మెడలో హారం, చెవులకు జుంకీలు, చేతులకు గాజులు, పూలతో అలంకరించిన జడతో ఆమె లుక్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. తోటలో కుర్చీపై కూర్చొని సిమ్రాన్ ఇచ్చిన సింపుల్ పోజులు ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. సంప్రదాయ వస్త్రధారణలో ఆమె సొగసైన లుక్ అభిమానులను ఆకట్టుకోవడంతో ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

# అందంతో ఆకట్టుకున్న ఆషికా

- సర్దార్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆషికా రంగనాథ్..
- బ్లాక్ అండ్ వైట్ శారీలో అదిరిపోయే లుక్

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ నటించిన 'సర్దార్ 2' తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్న ఈ వేడుక అభిమానుల్లో సందడి నింపింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఆషికా రంగనాథ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆషికా రంగనాథ్ ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ స్ట్రిప్స్‌తో కూడిన చీరలో ఈవెంట్‌కు హాజరైన ఆమె.. సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికగా కనిపించారు. చీరకు తగ్గట్టుగా బ్లాక్ కలర్ డిజైనర్ బ్లౌజ్‌ను ధరించారు. బ్లౌజ్‌పై ఉన్న నెట్ డిజైన్, ప్రత్యేకమైన నెక్‌లైన్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి లూజ్‌గా వదిలిన హెయిర్, సింపుల్ మేకప్‌తో ఆషికా తన అందాన్ని మరింత హైలైట్ చేశారు. పొడవాటి ఇయర్‌రింగ్స్ ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా ఎలిగెంట్‌గా కనిపిస్తూ ఫొటోగ్రాఫర్లకు పోజులిచ్చారు. ముఖ్యంగా చీర కొంగును స్టైలిష్‌గా క్యారీ చేస్తూ, చేతులు జోడించి చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు హాజరైన అభిమానులు ఆషికాను చూసి సందడి చేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.